


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 07-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :20 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

# రికార్డు స్థాయికి రైతు భరోసా!



15 లక్షల మందికి కొత్త లబ్ధి!

రూ.73,320 కోట్ల భరోసా!

73 లక్షల రైతులకు అండ!

బోగస్ జాబితాపై కొరడా!

అర్హులకే రైతు భరోసా!

నిజమైన రైతులకే సాయం!

ఖరీఫ్ నిధుల జమ షురూ!

**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం** తెలంగాణలోని రైతులను ఆదుకునేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంట పెట్టుబడి సాయం సరికొత్త మైలురాయిని అధిగమించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు బంధుగా ప్రారంభమై.. ప్రస్తుతం రైతు భరోసాగా కొనసాగుతున్న ఈ పథకం కింద ప్రభుత్వం రైతులకు అందించిన మొత్తం నిధుల పంపిణీ ఏకంగా 46 శాతం పెరిగి రూ. 73,320 కోట్లకు చేరుకుంది. ప్రభుత్వ అధికారిక డేటా ప్రకారం.. 2018లో ఈ పథకం ప్రారంభమైనప్పుడు కేవలం భూమి ఉన్న సుమారు 58 లక్షల మంది రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందేది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం పరిధిని మరింత విస్తృతం చేస్తూ అర్హులైన వ్యవసాయ కూలీలను, కౌలు రైతులను కూడా ఇందులో భాగస్వామ్యం చేసింది. దీనివల్ల ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య 73 లక్షల మార్కును దాటింది.

మిగతాది 2 లో..

# మొబైల్ యూజర్లకు షాక్

3-4 నెలల్లో ధరల పెంపు!

12-15% వరకు టారిఫ్ షాక్

మళ్లీ పెరగనున్న రీచార్జ్ భారం

ARPU పెంపే కంపెనీల లక్ష్యం

5G పెట్టుబడులే ప్రధాన కారణం

ప్రైవేట్ టెలికాం కొత్త వ్యూహం




2 లో

**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం:** మొబైల్ వినియోగదారుల నెత్తిన మరో పిడుగు పడనుంది. భారతీయ టెలికాం రంగంలో రాబోయే మూడు నుండి నాలుగు నెలల్లో మొబైల్ ఛార్జీలు భారీగా పెరిగే అవకాశం ఉందని 'సెంట్రమ్ ఇన్స్టిట్యూషనల్ రీసెర్చ్' తాజా నివేదికలో అంచనా వేసింది. మార్కెట్ కన్సాలిడేషన్ తర్వాత ధరలు పెంచడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడటమే దీనికి కారణమని ఆ సంస్థ వెల్లడించింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితి కారణంగా ఇప్పటికే సగటు మానవుడు ఇబ్బందులు పడుతుండగా ఇప్పుడు మొబైల్ రీచార్జి కూడా మరింత ప్రియం కానుండటం సామాన్యుల బతుకులపై ఆర్థిక భారంగా మారనుంది.

# ఆరు రోజుల విదేశీ పర్యటన




2 లో

మూడు దేశాల్లో కీలక భేటీలు

ఇండోనేషియాతో వ్యూహాత్మక బంధం

ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక చర్చలు

వాణిజ్యం, రక్షణపై ఫోకస్

# పహల్గాం ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం

హఫీజ్ సయీద్ పేరు చేర్పు

లష్కర్ చీఫ్‌పై కఠిన అభియోగాలు

ఉగ్రకుట్రకు పక్కా ఆధారాలు

భారత్‌పై యుద్ధమే లక్ష్యం

పహల్గాం కేసులో కీలక మలుపు

26 మంది బలిగొన్న దాడి



2 లో

**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం** దేశంలో తీవ్ర విషాదం నింపిన ఏప్రిల్ 2025 పహెల్గాం ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో లష్కరే తోయిబా, దాని అనుబంధ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' వ్యవస్థాపకుడు, చీఫ్ హఫీజ్ సయీద్‌పై పేరును ఎన్ఐఏ చార్జిషీట్‌లో చేర్చింది. ఈ కేసులో సోమవారం జాతీయ దర్యాప్తు సంస్థ సోమవారం అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.

# మహారాష్ట్రను ముంచెత్తిన వర్షం



2 లో

13 మంది మృతి

ముంబైకి రెడ్ అలర్ట్

హైవేలపై ట్రాఫిక్ స్తంభన

కొండచరియలు విరిగిపడిన ఘటనలు

లోనావాలాలో రికార్డు వర్షం

# ఢిల్లీలో మరో భారీ ఉగ్రకుట్ర భగ్నం



2 లో

నలుగురు ఉగ్ర అనుమానితుల అరెస్ట్

ధార్మిక స్థలాలపై రెక్కీ

పాక్ హ్యాండ్లర్లతో సంబంధాలు

విదేశీ పిస్టళ్ల స్వాధీనం

డ్రోన్ల ద్వారా ఆయుధాల సరఫరా

దేశంలో అశాంతే లక్ష్యం

# అయోధ్య విరాళాల చోరీ కేసు



2 లో

ట్రస్ట్‌లో కీలక మార్పులు

చంపత్‌రాయ్ రాజీనామాకు ఆమోదం

విరాళాల అక్రమాలపై సిట్ దర్యాప్తు

కొత్త ప్రధాన కార్యదర్శిగా బాగ్రా

ఎనిమిది మంది ఇప్పటికే అరెస్ట్

**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం, నిధుల చోరీ ఆరోపణల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రా రాజీనామాలను ట్రస్ట్ బోర్డు ఆమోదించింది. సోమవారం ఆలయ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్ లో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. చంపత్ రాయ్ స్థానంలో విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి, చార్టర్డ్ అకౌంటెంట్ భజరంగ్ లాల్ బాగ్రాను కొత్త ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించారు.

రామమందిర నిర్మాణానికి వచ్చిన నిధుల అక్రమాలపై యూపీ ప్రభుత్వం సిట్ వేసిన విషయం తెలిసిందే. విరాళాల దుర్వినియోగంపై సిట్ విచారణను వేగవంతం చేసింది. సిట్ జరుపుతున్న దర్యాప్తుపై తమకు పూర్తి నమ్మకం ఉందని ట్రస్ట్ స్పష్టం చేసింది. తప్పు చేసిన వారు ఎవరైనా సరే శిక్ష తప్పదని ట్రస్ట్ అధ్యక్షుడు మహంత నృత్య గోపాల్ దాస్ పేర్కొన్నారు.

# హార్పిక్‌తో హత్య

వివాహేతర బంధం కోసం హత్య


భర్తపై కిరాతక దాడి

హార్పిక్ ఇంజెక్ట్ చేసిన భార్య

నిజామాబాద్‌లో సంచలనం

పోలీసుల అదుపులో నిందితులు

దర్యాప్తులో వెలుగుచూసిన నిజాలు



2 లో

**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం** పర పురుషుడి వ్యామోహంలో పడి, వివాహేతర సంబంధాలకు అలవాటు పడిన భార్యలు, అమాయకులైన భర్తల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో దారుణం వెలుగుచూసింది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య కట్టుకున్న భర్తను అత్యంత కిరాతకంగా అంతమొందించింది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతంలో నివసిస్తున్న ప్రశాంత్, సంధ్య దంపతులు నివాసం ఉంటున్నారు.

# టూరిజంపై సీఎం ప్రత్యేక ఫోకస్

## పర్యాటక అభివృద్ధికి కీలక ఆదేశాలు

తారామతి, దుర్గం చెరువుకు కొత్త రూపు

వికారాబాద్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం

ఎకో టూరిజం ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

హెరిటేజ్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

గ్లోబల్ సమ్మిట్‌కు ఇప్పటినుంచే సన్నాహాలు



2 లో

# రావణ్‌లో మావోయిస్టు భావజాలం..

## వెలుగులోకి సంచలన విషయాలు



2 లో

# ఉద్యోగుల బదిలీలపై నిషేధం

## కొత్త జోనల్ విధానానికి గ్రీన్‌సిగ్నల్

బదిలీలు, ప్రమోషన్లు నిలిపివేత

26 జిల్లాలకు స్థానిక కేడర్లు

6 జోన్లు.. 2 మల్టీ జోన్లు

ఉద్యోగుల కేటాయింపునకు మార్గదర్శకాలు

కేడర్ పూర్తి అయ్యే వరకు వెయిట్

రాష్ట్రపతి ఉత్తర్వులతో కీలక మార్పులు

స్థానిక కేడర్లపై సర్కార్ ఫోకస్

2 లో

# మొబైల్ యూజర్లకు షాక్..

మొదటి పేజీ తరువాయి

12-15 శాతం వరకు పెరిగే చాన్స్:




సామాన్యులకు షాక్ ఇస్తూ ఈ సారి ఏకంగా 12-15 శాతం వరకు టారిఫ్స్ పెరిగే అవకాశం ఉందని ఈ సంస్థ అంచనావేసింది. ప్రస్తుతం మార్కెట్లో కేవలం 3 ప్రైవేట్ + 1 ప్రభుత్వ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారని, అందువల్ల రాబోయే 3-4 ధరల పెంపు ఉండే అవకాశం ఉందని ఈ బ్రోకరేజ్ సంస్థ తన Q1FY27 టెలికాం అండ్ ఇంటర్నెట్ సెక్టార్ ప్రివ్యూ నివేదికలో తెలిపింది. ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ల 'వినియోగదారుడి సగటు ఆదాయం' (ARPU) త్రైమాసిక ప్రాతిపదికన (QoQ) 1-1.5 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. వినియోగదారులు 2G నుండి 4G, 5G నెట్‌వర్క్‌లకు మారడం, పోస్ట్‌పెయిడ్ కస్టమర్ల సంఖ్య పెరగడం మరియు ఈ త్రైమాసికంలో ఎక్కువ రోజులు ఉండటం దీనికి కారణాలని పేర్కొంది.

పెంపుపై కంపెనీల వ్యూహాలు:

నిజానికి గత కొంత కాలంగా టారిఫ్ ల ధరలు పెంచేందుకు టెలికాం సంస్థలు ప్రణాళికలు రచిస్తున్నాయి. G సేవలను ఉచితంగా అందించడం వల్ల కంపెనీలు ఆశించినంత లాభాల్లో లేవని తాము పెట్టిన భారీ పెట్టుబడులను తిరిగి రికవరీ చేసుకోవడంతో పాటు, ప్రతి కస్టమర్ నుండి వచ్చే సగటు ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవాలనే వ్యూహాత్మక ప్రణాళికతోనే ఈ టెలికాం కంపెనీలు టారిఫ్ ధరలు సవరించాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ సైతం పెంపు ఉండబోతోందనే అంచనా ఇప్పుడు మొబైల్ యూజర్ల వెన్నులో వణుకు పుట్టించేలా మారింది.

# ఆరు రోజుల విదేశీ పర్యటన




**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం:** ప్రధాని నరేంద్ర మోడీ మూడు దేశాల పర్యటనకు ఇవాళ బయలుదేరి వెళ్లారు. ఆరు రోజుల పాటు సాగనున్న ఈ పర్యటనలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. పర్యటనకు ముందు ప్రధాని మోడీ తన అధికారిక ప్రకటనను విడుదల చేశారు. ఈ దేశాలతో ఆర్థిక, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు తాను జులై 6 నుండి 8 వరకు ఆ దేశంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈనెల 8,9 తేదీలలో ఆస్ట్రేలియాలో ఈ నెల 10,11 తేదీల్లో న్యూజిలాండ్ లో పర్యటించనున్నారు.

ఇండోనేషియాతో వ్యూహాత్మక బంధం:

2018లో తాను ఇండోనేషియాలో పర్యటించిన సమయంలో ఇరు దేశాల మధ్య కుదిరిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, 2025 గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా భారత్‌కు విచ్చేసిన సంగతి తెలిసిందే. ఇండోనేషియా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడ నివసిస్తున్న భారతీయ సమాజంతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అలాగే అధ్యక్షుడు ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ 'ప్రాంబనన్' ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు.


ఆస్ట్రేలియాలో కీలక చర్చలు:

ఇండోనేషియా పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ నేరుగా మెల్‌బోర్న్ చేరుకుంటారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ ఆహ్వానం మేరకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం-పెట్టుబడులు, విద్య, మొబిలిటీ, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలు, క్రీడలు, ప్రజా సంబంధాల వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ పర్యటన భారత్-ఆస్ట్రేలియా వ్యూహాత్మక బంధాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్తుందని ప్రధాని పేర్కొన్నారు. అక్కడ కూడా ఆయన భారత సంతతి ప్రజలతో భేటీ కానున్నారు.

40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌కు భారత ప్రధాని:

పర్యటన చివరి దశలో ప్రధాని మోదీ న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌కు చేరుకుంటారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన సాగనుంది. గత ఏడాది మార్చిలో పీఎం లక్సన్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన కల్పించిన సానుకూల వాతావరణాన్ని ముందుకు తీసుకెళ్తూ.. ఆర్థిక, వాణిజ్య, వాణిజ్యపరమైన భాగస్వామ్యాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# హార్పిక్‌తో హత్య



**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం:** పర పురుషుడి వ్యామోహంలో పడి, వివాహేతర సంబంధాలకు అలవాటు పడిన భార్యలు, అమాయకులైన భర్తల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో దారుణం వెలుగుచూసింది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య కట్టుకున్న భర్తను అత్యంత కిరాతకంగా అంతమొందించింది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతంలో నివసిస్తున్న ప్రశాంత్, సంధ్య దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే, గత కొంతకాలంగా ఇద్దరిమధ్య గొడవలు జరుగుతున్నాయి. సంధ్యకు మరో వ్యక్తితో ఉన్న వివాహేతర సంబంధమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో భర్తను ఎలాగైనా శాశ్వతంగా వదిలించుకోవాలని సంధ్య పక్కా స్కెచ్ వేసింది. పథకం ప్రకారం భర్త ప్రశాంత్‌కు అతిగా మద్యం తాగించింది. అతడు పూర్తిగా మత్తులోకి జారుకున్నాక ప్రియుడిని ఇంటికి పిలిపించి ఇద్దరూ తీవ్రంగా దాడి చేసి భవనం మీద నుంచి మొదట కిందకు తోసేశారు. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి, కానీ ప్రాణాలు మాత్రం పోలేదు.

నరాల్లోకి టాయిలెట్ క్లీనర్ ఇంజెక్ట్..

అయితే, దాడి చేసిన భవనం పైనుంచి తోసేసినా.. ప్రశాంత్ ఇంకా బతికే ఉన్నాడని, శ్వాస తీసుకుంటున్నాడని సంధ్య గమనించింది. ఎలాగైనా అతడని అంతమొందించాలనే కసితో ఇంట్లో బాత్‌రూమ్‌లో ఉన్న టాయిలెట్ క్లీనర్ హార్పిక్ లిక్విడ్‌ను ఓ సిరంజిలోకి తీసుకుని ప్రశాంత్ నరాల్లోకి నేరుగా ఎక్కించింది. శరీరంలోకి విషపూరితమైన క్లీనర్ చేరడంతో ప్రశాంత్ కొద్దిసేపటికే అత్యంత దారుణమైన స్థితిలో ప్రాణాలు విడిచాడు. అయితే, భార్య సంధ్యపై అనుమానం వచ్చిన ప్రశాంత్ కుటుంబ సభ్యులు పోలీసులు సమాచారం అందజేయగా.. వారు స్పాటు చేరుకుని భార్య సంధ్య, ప్రియుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే, వివాహేతర బంధం కోసం అగ్ని సాక్షిగా తాళి కట్టిన భర్తనే దారుణంగా హతమార్చిన విషయం విని జిల్లా ప్రజలు.. ఇదేం పని అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

# ఢిల్లీలో మరో భారీ ఉగ్రకుట్ర భగ్నం..



**న్యూస్ డెస్క్, 06 జూలై (ఇది కద నిజం):** దేశ రాజధాని ఢిల్లీలో మరో భారీ ఉగ్రకుట్రను స్పెషల్ పోలీస్ అధికారులు భగ్నం చేశారు. ఢిల్లీలో దాడికి పాకిస్తాన్ ఐఎస్ఐ పన్నిన వ్యూహాన్ని ఈ ప్రత్యేక విభాగం సమర్థవంతంగా తిప్పికొట్టింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న గ్యాంగ్‌స్టర్-టర్న్డ్-టెర్రరిస్ట్ షహజాద్ భట్టి గూఢచార నెట్‌వర్క్‌కు చెందిన రెండు వేర్వేరు మాడ్యూళ్లను పోలీసులు విజయవంతంగా ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఢిల్లీ, పంజాబ్ సరిహద్దు ప్రాంతాలలో ఏకకాలంలో దాడులు నిర్వహించి నలుగురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు.

ధార్మిక స్థలాలు, పోలీస్ స్టేషన్లపై రెక్కీ..

పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఉగ్ర నెట్‌వర్క్ రెండు విభిన్న విభాగాలుగా పనిచేస్తోంది. ఒకటి ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో దాడులకు ప్లాన్ చేసే ఉగ్రవాద విభాగం కాగా, రెండోది పాక్ సరిహద్దుల నుంచి డ్రోన్ల ద్వారా ఆయుధాలు, మత్తు పదార్థాలను సరఫరా చేసే ఆయుధాల అక్రమ రవాణా విభాగం. అరెస్ట్ అయిన వారిలో పంజాబ్‌కు చెందిన ముగ్గురితో పాటు ఢిల్లీలో పట్టుబడిన గగన్‌ప్రీత్ అనే నిందితుడు ఉన్నాడు. ఈ గగన్‌ప్రీత్ దిల్లీలోని సున్నితమైన ధార్మిక స్థలాలు, పోలీస్ స్టేషన్లు, భద్రతా తనిఖీ కేంద్రాల వద్ద వీడియోలు తీస్తూ ముమ్మరంగా రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఇక్కడ భారీగా కాల్పులు జరిపేందుకు అతనికి పాక్ హ్యాండ్లర్లు విదేశీ నంబర్ల ద్వారా ఆదేశాలు ఇచ్చారు.

అత్యాధునిక విదేశీ తుపాకులు స్వాధీనం..

నిందితుల నుంచి పోలీసులు జిగానా రకానికి చెందిన అత్యాధునిక విదేశీ పిస్టళ్లు, తొమ్మిది లైవ్ బుల్లెట్లు, హ్యాండ్లర్లతో మాట్లాడేందుకు ఉపయోగించిన ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్ యువతను సోషల్ మీడియా ద్వారా ట్రాప్ చేసి, వారికి ఆయుధాలు అందించి దేశంలో అశాంతి సృష్టించేందుకు షహజాద్ భట్టి కుట్ర పన్నినట్లు ఢిల్లీ పోలీస్ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ త్రిపాఠి వెల్లడించారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేసి, ఈ అంతర్రాష్ట్ర ముఠా వెనుక ఉన్న మరికొందరు స్థానిక లింకుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# పహల్గాం ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి



జమ్మూలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో సమర్పించిన ఈ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌లో హాఫీజ్ సయీద్‌ను వ్యక్తిగత హోదాలోనూ, అలాగే నిషేధిత ఉగ్రవాద సంస్థ నామ/ఠ=ఖీ చీఫ్‌గానూ ఎన్ఐఏ నిందితుడిగా చేర్చింది.

భారత్‌పై యుద్ధం ప్రకటించినట్లుగా గుర్తింపు

సయీద్‌పై భారతీయ న్యాయ సంహిత-2023, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం-1967 లోని పలు కఠినమైన సెక్షన్ల కింద ఎన్ఐఏ అభియోగాలు మోపింది. సరిహద్దు అవతలి నుంచి భారతదేశానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించడం, ఉగ్ర కుట్రలు పన్నడం వంటి నేరాలకు సంబంధించిన సెక్షన్లను కూడా ఈ ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. గతంలో దాఖలు చేసిన 1,597 పేజీల ప్రధాన ఛార్జ్‌షీట్‌కు కొనసాగింపుగా ఈ అదనపు ఛార్జ్‌షీట్‌ను ఎన్ఐఏ దాఖలు చేసింది. ఇందులో పాకిస్తాన్ పన్నిన కుట్రలు, హాఫీజ్ సయీద్ కీలక పాత్ర, మరియు క్షేత్రస్థాయి విచారణ, శాస్త్రీయ ఆధారాలను ఎన్ఐఏ పక్కాగా పొందుపరిచింది. కాగా, 22 ఏప్రిల్ 2025న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు మత ప్రాతిపదికన టార్గెట్ చేసి దారుణ ఊచకోతకు పాల్పడ్డారు. ఈ దాడిలో 25 మంది అమాయక పర్యాటకులు, ఒక స్థానిక పౌరుడు ప్రాణాలు కోల్పోయారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసు..

మొదటి పేజీ తరువాయి



ట్విస్ట్ ఏంటంటే.. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను సిట్, అయోధ్య పోలీసులు ఇప్పటికే సుదీర్ఘంగా విచారించినప్పటికీ, ఇప్పటివరకు వారిపై ఎలాంటి ప్రథమ సమాచార నివేదిక నమోదు కాలేదు. కేవలం నైతిక బాధ్యత వహిస్తూనే వారు తమ పదవులకు రాజీనామా చేశారు.

డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది అరెస్ట్ఈ నిధుల చోరీ వ్యవహారంలో చంపత్ రాయ్ అత్యంత ఆప్తుడు, ఆయన మాజీ డ్రైవర్ అయిన రమాశంకర్ అలియాస్ టిన్ను యాదవ్‌తో పాటు హుండీ నగదు లెక్కింపు ప్రక్రియలో ఉన్న ఎనిమిది మంది సిబ్బందిని సిట్ ఇప్పటికే అరెస్ట్ చేసింది. హుండీ లెక్కింపు గదిలోని సీసీటీవీ కెమెరాలకు అడ్డం పడుతూ, అత్యంత తెలివిగా నోట్ల కట్టలను దొంగిలించి బాత్‌రూమ్‌లలో దాచి, ఆపై బయటకు తరలించేవారని సిట్ దర్యాప్తులో తేలింది.

# రికార్డు స్థాయికి రైతు భరోసా!

మొదటి పేజీ తరువాయి

ఈ మొత్తం వ్యయంలో 2018 నుంచి 2023 వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 50,250 కోట్లు పంపిణీ చేయగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు మరో రూ. 23,070 కోట్లను విజయవంతంగా విడుదల చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సుమారు 9 లక్షల మంది నిరుపేద వ్యవసాయ కూలీలను చేర్చారు. గతంలో భూమి ఉన్నవారికే సాయం దక్కే విధానం ఉండగా.. ఇప్పుడు నిజమైన కౌలు రైతులు, కూలీలకు కూడా ఆర్థిక అండ లభిస్తోంది. దీనివల్ల రాష్ట్ర బడ్జెట్‌పై వార్షిక భారం పెరిగినప్పటికీ, నిరుపేద రైతులకు నేరుగా నగదు బదిలీ జరుగుతోందని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా వారీగా పరిశీలిస్తే, అత్యధికంగా నల్గొండ జిల్లాకు రూ. 5,491 కోట్ల గరిష్ట నిధులు అందగా.. ఆ తర్వాత స్థానాల్లో సంగారెడ్డి, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాలు నిలిచాయి. అత్యల్పంగా వ్యవసాయ భూములు లేని హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంది.

ఇదిలా ఉండగా.. ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అర్హత లేని బోగస్ లబ్ధిదారులను, సాగులో లేని భూములను ఈ జాబితా నుండి తొలగించే ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. డేటాబేస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా ప్రభుత్వ సహాయం నిజమైన రైతులకు, కూలీలకు మాత్రమే చేరేలా పక్కా నిబంధనలను అమలు చేస్తున్నట్లు రెవెన్యూ వర్గాలు స్పష్టం చేశాయి. కాగా, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. విడతల వారీగా ఈ డబ్బులు రైతుల ఖతాల్లో జమ కానున్నాయి.



# ఉద్యోగుల బదిలీలపై నిషేధం..

**న్యూస్ డెస్క్, 06 జూలై (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై తాత్కాలిక నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక కేడర్ల వారీగా ఉద్యోగుల కేటాయింపు పూర్తయ్యే వరకు బదిలీలతో పాటు కొత్త నియామకాలు, పదోన్నతులు (ప్రమోషన్లు), డిప్యుటేషన్లపై కూడా నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణ, కేడర్ సంఖ్య ఖరారు, ఉద్యోగుల పంపిణీ, అమలు మార్గదర్శకాలకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 'రాష్ట్రపతి ఉత్తర్వు--2025' ప్రకారం రాష్ట్రంలోని 26 జిల్లాలకు స్థానిక కేడర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది.

అయితే, మార్కాపురం, పోలవరం జిల్లాలు ప్రస్తుతం రాష్ట్రపతి ఉత్తర్వు--2025 పరిధిలోకి రావని ప్రభుత్వం పేర్కొంది. ఈ రెండు జిల్లాలకు తాత్కాలికంగా ఉద్యోగులను కేటాయిస్తామని స్పష్టం చేసింది.

ఆంధ్రప్రదేశ్‌ను 6 జోన్లు, 2 మల్టీ జోన్లుగా విభజన

కొత్త జోనల్ విధానం ప్రకారం రాష్ట్రాన్ని 6 జోన్లు, 2 మల్టీ జోన్లుగా విభజిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

మల్టీ జోన్ - 1

జోన్-1: శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు

జోన్-2: తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి

జోన్-3: ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు

ఈ జోన్‌లో అమరావతి రాజధాని ప్రాంతం కూడా ఉంటుంది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల మధ్య పోస్టుల పంపిణీకి ప్రత్యేక నిష్పత్తి అమలు చేయనున్నారు.

మల్టీ జోన్ - 2

జోన్-4: బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

జోన్-5: తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప

జోన్-6: నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి

కర్నూలు, నంద్యాల జిల్లాల మధ్య పోస్టులను 55:45 నిష్పత్తిలో పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక, ఈ మార్గదర్శకాలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాలు, హైకోర్టు పోస్టులకు వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# టూరిజంపై సీఎం ప్రత్యేక ఫోకస్



**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం:** తెలంగాణలో పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, పర్యాటక శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై పలు కీలక ఆదేశాలు జారీ చేసిన సీఎం.. తారామతి బారాదరిని మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇంకా మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, అక్కడి వీరభద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అటవీ శాఖ పరిధిలోని భూములను పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుని ఎకో టూరిజం ప్రాజెక్టులుగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులను ఏర్పాటు చేయాలని, ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అర్బన్ ఫారెస్ట్ నమూనాలో ప్రత్యేక ప్రాజెక్టులను చేపట్టి, వాటి అమలును వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు.

మరోవైపు హైదరాబాద్ నగర చారిత్రక వారసత్వాన్ని పర్యాటక రంగానికి అనుసంధానం చేసే దిశగా పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జ్‌ను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ఈ వంతెనపై పర్యాటకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక కార్యకలాపాలకు అవకాశం కల్పించాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటి నుంచే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. సమ్మిట్ విజయవంతం కోసం వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు.

# మహారాష్ట్రను ముంచెత్తిన వర్షం

**న్యూస్ డెస్క్, 06 జూలై ఇది కద నిజం** దేశ ఆర్థిక రాజధాని మహారాష్ట్రను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని నగరాల్లో కుంభవృష్టి కురుస్తోంది. ముంబై-పూణె నేషనల్ హైవే నీటమునిగిపోయవడంతో వందలాది వాహనాలు రోడ్డున నిలిచాయి. హైవేపై వరుసగా కొండచరియలు విరిగిపడటంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, కాలనీలు, రైల్వే ట్రాకులు సైతం చెరువులను తలపిస్తున్నాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న కుండపోత వానల కారణంగా ముంబై, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాల్లో వేర్వేరు ప్రమాదాల్లో ఇప్పటివరకు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ముంబయి దాని పరిసర ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ప్రముఖ పర్యాటక ప్రాంతం లోనావాలాలో రికార్డు స్థాయిలో 670 మిల్లీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితులపై మహారాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీష్ మహాజన్ సోమవారం అధికారిక ప్రకటన చేశారు. రాష్ట్రంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల భారీ నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు.

# రావణ్‌లో మావోయిస్టు భావజాలం..

**న్యూస్ డెస్క్, 06 ఇది కద నిజం:** ప్రశ్న రావణ్ లో మావోయిస్టు భావజాలం ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయన్ను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే రిమాండ్ రిపోర్టులో పొందుపర్చిన కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. రావణ్ ఫోన్‌ను పరిశీలించడంతో అందులో మావోయిస్టు భావజాలం ఉన్నట్లు తాము గుర్తించామని తెలిపారు. అలాగే మావోయిస్టు హిడ్మాను రావణ్ కీర్తిస్తూ ప్రసంగించిన వీడియోలు సైతం ఫోన్‌లో ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాదు హిందూ దేవుళ్లే టార్గెట్‌గా రావణ్ పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేవుళ్లను కించపర్చడం, అవమానించడంలో భాగంగానే తాను రావణ్ అనే పేరు పెట్టుకున్నారని వివరించారు. మత, కుల పరమైన విభేదాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రసంగాలు, పదవుల్లో ఉన్న వారిని దూషించడం, వ్యవస్థలపై ద్వేషం కలిగించేలా రావణ్ తీరు ఉందని తెలిపారు. అంతేకాదు అసలు రావణ్‌కు సహకరిస్తున్న వారెవరో కూడా తేలాల్సి ఉందని, విచారణకు కూడా ఆయన సహకరించలేదని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

ప్రశ్న రావణ్‌కు రిమాండ్

కాగా యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌ను పవన్ కల్యాణ్‌పై చేసిన అసభ్య కామెంట్స్ కేసులో గన్నవరం కోర్టులో ప్రవేశ పెట్టడంతో ధర్మాసనం 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయనపై గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఉపా సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదుతో నమోదైన ఈ కేసులో రావణ్‌ను అరెస్ట్ చేసి ఈ నె 18 వరకు విధించిన రిమాండ్ నేపథ్యంలో పోలీసులు జైలుకు తరలించారు.

# హైదర్గూడాలో ఘనంగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు




ఇది కద నిజం,అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్గూడా చౌరస్తాలో జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. డివిజన్ బీజేపీ అధ్యక్షులు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశం గాడి తప్పుతున్న వేళ ప్రజా సమస్యలపై గళమెత్తి, దేశాభివృద్ధి కోసం జాతీయవాద భావాలతో పని చేసేలా నేటి బీజేపీకి పునాది అయిన "జన్ సంఘ్"ను శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్థాపించారని ఆయన కొనియాడారు. భారత్‌ను ఒక విశ్వగురుగా, వసుధైక కుటుంబంగా ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ముఖర్జీ ఆకాంక్ష అని పేర్కొంటూ, ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ కడెం సుధాకర్, జిల్లా ఆఫీస్ సెక్రటరీ విజయకుమార్, నాయకులు జయానంద్ రెడ్డి, నల్లింగ్ రమేష్, జి. రాజు, సతీష్, శ్రీను, లక్ష్మీకాంత్ రెడ్డి, శివ, ప్రవీణ్, చంద్రశేఖర్ శెట్టి, అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సముద్రాలు దాటినా. .మాతృభూమిపై మమకారం

## అమెరికాలో ఉన్నా... పల్లె బడి పిల్లల భవిష్యత్తుకు అండగా నిలిచిన చందా రాహుల్--ఆదిత్య మైత్రి దంపతులు





ధర్మసాగర్, జూలై 6 ఇది కద నిజం

సేవకు సరిహద్దులు ఉండవని, వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా స్వగ్రామం పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత మరువకూడదని ఆచరణలో చూపించారు అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న యువ దంపతులు చందా రాహుల్--ఆదిత్య మైత్రి. విదేశాల్లో స్థిరపడినా తమ పల్లె ప్రభుత్వ పాఠశాల చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించాలనే సంకల్పంతో నారాయణగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందించి గొప్ప సేవాభావాన్ని చాటుకున్నారు.నేటి కాలంలో చాలామంది స్వగ్రామాన్ని మరచిపోతుంటే, చందా రాహుల్--ఆదిత్య మైత్రి దంపతులు మాత్రం విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందుకు వచ్చి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారు. వారి ఈ ఉదారత విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే కాకుండా, సేవాభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్న ఉపాధ్యాయుల కృషికి ఇలాంటి దాతల సహకారం మరింత బలాన్నిస్తుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన చందా శోభారాణి--రమేష్ దంపతులతో పాటు వారి కుమారుడు చందా రాహుల్, కోడలు ఆదిత్య మైత్రి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం.డి. బషీర్, ఉపాధ్యాయ బృందం, పుట్ట కుమార్, బుద్ధె రమేష్, వక్కల కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు."విదేశాల్లో నివసిస్తున్నా... స్వగ్రామ ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంత పిల్లల్లా భావించి చేయూతనందించిన చందా రాహుల్--ఆదిత్య మైత్రి దంపతుల సేవా తత్వం నిజంగా ప్రశంసనీయం. వారి ఉదారత మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని గ్రామస్థులు ఆకాంక్షించారు."

# బుగ్గపాడు, రుద్రాక్షపల్లి కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన మట్టా దంపతులు"



సత్తుపల్లి,జూలై06 ఇది కద నిజం సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం భారీగా జరిగింది. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై బుగ్గపాడు, రుద్రాక్షపల్లి గ్రామాల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలను ప్రకటించి సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ బుగ్గపాడు గ్రామ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా నూతన గ్రామ కమిటీలు కృషి చేయాలని సూచించారు.గ్రామస్థులతో సమన్వయం పెంచుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బుగ్గపాడు ఫుడ్ పార్కులో స్థానిక యువతకు టెక్నికల్, నాన్-టెక్నికల్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటామని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు.సమావేశంలో బుగ్గపాడు, రుద్రాక్షపల్లి గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై మట్టా దంపతులకు ఘన స్వాగతం పలికారు. మహిళలు ఎమ్మెల్యేతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందుతున్నామని, పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, బుగ్గపాడు కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స రాఘవరావు, గోపాలరావు, రవీంద్రబాబు, కిసర రాంబాబు, రుద్రాక్షపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నమనేని దామోదర్‌రావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి హలవత్ అర్జున్, సర్పంచ్ పాయం నాగేంద్రబాబు, ఉపసర్పంచ్ భూపతిరెడ్డి, బత్తుల భరత్ కుమార్, నిర్మల, కొరసా వసంతరావు, సారా రవి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పుగల్లులో రోడ్ల దుస్థితిపై బీజేపీ ఫైర్

## "ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం" -- కోరుకొప్పుల నాగేష్ గౌడ్

జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం ఉప్పుగల్లు గ్రామంలో ప్రజా సమస్యలను పరిశీలించిన బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గ్రామంలో రోడ్లు చెరువులను తలపించేలా మారినా, వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించిన బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్ గౌడ్ మాట్లాడుతూ, "సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. అధికార పార్టీ సర్పంచ్ ఉన్న గ్రామానికే ఈ దుస్థితి ఉంటే, మిగతా గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు" అని విమర్శించారు.గ్రామంలోని రోడ్లు గుంతలమయంగా మారి ప్రతి వర్షానికి చిన్నపాటి చెరువుల్లా కనిపిస్తున్నాయని, సైడ్ కాలువలు తవ్వకపోవడంతో బురద, మురుగు నీరు నిలిచి దోమల పెంపక కేంద్రాలుగా మారాయని ఆరోపించారు.గ్రామస్తుల ఆరోగ్యాన్ని గాలికొదిలేసిన పాలకులు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.ఇటీవల గ్రామంలో జరిగిన అంత్యక్రియల సందర్భంగా ఇతర గ్రామాల ప్రజలు కూడా "ఇవి రోడ్లా... చెరువులా?" అంటూ ఆశ్చర్యపోయారని గ్రామస్తులు నాయకులకు వివరించినట్లు తెలిపారు.గ్రామ సమస్యలపై వెంటనే మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి, ఉపాధి హామీ పథకం లేదా ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన నిధులతో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం రాజు గౌడ్, జిల్లా నాయకుడు బుర్ర తిరుపతి గౌడ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గాదెపాక శ్రీను, వల్లాల శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ఇది కద నిజం**

జంతువుల ద్వారా మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. జునోసిస్ వ్యాధుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జంతువులలో ఉండే వైరస్ వివిధ మార్గాల ద్వారా మనుషుల్లోకి ప్రవేశిస్తుందని, అందువల్ల జంతువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు మనుషులకు వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. జంతువులలో గానీ, మనుషులలో గానీ ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి తగిన వైద్య సేవలు పొందాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా ఇళ్లలో పెంచుకునే పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, సకాలంలో వ్యాక్సినేషన్లు వేయించాలని కలెక్టర్ సూచించారు. క్రమబద్ధమైన పరీక్షల నిర్వహణ ద్వారా జంతువుల్లో వచ్చే వ్యాధులను త్వరితగతిన గుర్తించి, అవి మనుషులకు వ్యాపించకుండా సమర్థవంతంగా అడ్డుకోవచ్చని తెలిపారు. పెంపుడు జంతువులు లేదా పశువులు అనారోగ్యంగా ఉన్నట్లు గమనిస్తే తక్షణమే పశువైద్యులను సంప్రదించి చికిత్స అందించాలన్నారు. జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమించకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం మాత్రమే ఏకైక రక్షణ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, డిఆర్ఓ వసంత కుమారి, డిప్యూటీ శిక్షణా కలెక్టర్ నవీన్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పియస్ మండల కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ 40వ వర్ధంతి వేడుకలు

నవాబ్‌పేట్, 06 జూలై ఇది కద నిజం భారతదేశ మాజీ ప్రధాని స్వతంత్ర సమరయోధుడు 40వ వర్ధంతి సందర్భంగా నవాబు పేట్ మండల కేంద్రం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు గుట్ట కింది రవికుమార్ మాదిగ, వికారాబాద్ మండలం ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ, మాజీ ఉప సర్పంచ్ రవీందర్ ఫిల్డ్ అసిస్టెంట్ రాంచెంద్రయ్య, సీనియర్ నాయకులు నాగేష్ శ్రీహరి, అనంతయ్య, చించాల్పేట్ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ మాదిగ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట భాదితుల ఆందోళన



గార్ల ఇది కద నిజం : సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న భూనిర్వశిత రైతులకు పెండింగ్ లో ఉన్న నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత 6 సం,రాలుగా పెండింగ్ లో ఉన్న భూనిర్వశిత రైతులకు చెల్లించాల్సిన భూ నష్టపరిహారం కై సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి,గ్రీవెన్స్ లో కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి పదిన్నర లక్షల రూ, లు చొప్పున ఇస్తామని చెప్పి ఆరు సంవత్సరాలు గడుస్తున్న 36 మంది రైతులకు ఇంతవరకు నష్టపరిహారం అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు భూములు స్వాధీనం చేసుకొని ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారని, భూములు కోల్పోయిన సన్న, చిన్న కారు రైతులు గత ఆరు సం,లుగా రైతుబంధు, రైతు భీమాకు, పంటలు వేసుకోవడానికి దూరంగా ఉండి ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వెలిబుచ్చారు. అటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇటు నష్టపరహారానికి దూరమైన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఎం మండల నాయకులు భాగం లోకేశ్వరరావు, వి మోహన్, బి రాందాస్,కె.రమేష్,జె. రమేష్, భూ నిర్వశితా బాధితులు, తదితరులు ఉన్నారు

# సినిమా న్యూస్

## వెంకీ తో నాని?



తెలుగు సినిమా పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న యువ దర్శకుల్లో వెంకీ అట్లూరి ఒకరు. వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కిన 'తొలిప్రేమ' చిత్రంతో దర్శకుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన, తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుని ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అయితే ఆ తర్వాత ఆయన తెరకెక్కించిన 'మిస్టర్ మజ్ను', 'రంగ్ దే' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయాయి.

దీంతో వెంకీ అట్లూరి కెరీర్ కాస్త నెమ్మదించింది. అలాంటి సమయంలో ధనుష్ హీరోగా రూపొందించిన 'సార్', దుల్కర్ సల్మాన్‌తో తెరకెక్కించిన 'లక్కీ భాస్కర్' చిత్రాలు వరుస బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకోవడంతో ఆయన మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చారు. ఈ రెండు సినిమాలతో వెంకీ అట్లూరి క్రేజ్ మరింత పెరిగింది. ప్రస్తుతం ఆయన సూర్య హీరోగా 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఇదిలా ఉంటే, వెంకీ అట్లూరి తన తదుపరి ప్రాజెక్ట్‌ను కూడా దాదాపు ఫైనల్ చేసినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ దర్శకుడు తన నెక్స్ట్ మూవీని నేచురల్ స్టార్ నానితో చేయనున్నట్లు, ఇప్పటికే ఇద్దరి మధ్య కథా చర్చలు కూడా పూర్తైనట్లు సమాచారం. అలాగే ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగ వంశీ నిర్మించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం నాని ఒకవైపు 'ది ప్యారడైజ్' చిత్రంలో నటిస్తూనే, మరోవైపు సుజిత్ దర్శకత్వంలో రూపొందనున్న 'బ్లడీ రోమియో' సినిమాకు కూడా కమిట్ అయిన విషయం తెలిసిందే.




## లాంగ్ షెడ్యూల్‌కు రెడీ చేస్తున్న కొరటాల!

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా, కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త చిత్రం కొద్ది రోజుల క్రితమే పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సినిమాలో బాలయ్య ఇప్పటివరకు కనిపించని వైవిధ్యమైన లుక్‌లో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పూజా కార్యక్రమాలు పూర్తై కొన్ని రోజులు గడిచినా, రెగ్యులర్ షూటింగ్ మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఆగస్టు రెండో వారం నుంచి ఈ చిత్రం తొలి షెడ్యూల్ ప్రారంభం కానుంది.

మొదటి షెడ్యూల్‌లోనే భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించాలని చిత్రబృందం ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. దాదాపు 20 రోజుల పాటు సాగే ఈ యాక్షన్ షెడ్యూల్‌లో బాలకృష్ణతో పాటు పలువురు ఫైటర్స్, కీలక నటీనటులు కూడా పాల్గొననున్నట్లు సమాచారం. సాధారణంగా కొరటాల శివ సినిమాల్లో పవర్‌ఫుల్ యాక్షన్‌తో పాటు సమాజానికి ఉపయోగపడే బలమైన సందేశం కూడా ఉంటుంది. ఈ చిత్రంలోనూ అలాంటి మెసేజ్‌కు ప్రాధాన్యం ఉండనున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాపై బాలకృష్ణ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్న ఈ చిత్రాన్ని యువసుధ ఆర్ట్స్ మరియు ూాం సినిమాస్ బ్యానర్లపై నిర్మించనున్నారు.

## నిర్మాతగా మారిన ప్రదీప్ రంగనాథన్

కోలీవుడ్ యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ వరుస హిట్స్ సాధించి సౌత్ ఇండస్ట్రీలో సెన్సేషన్ క్రియేట్ చేశారు. ఇక ఇటీవల భారీ అంచనాల మధ్య వచ్చిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. ఈ మూవీ నిర్మాతలకు నష్టాలను మిగల్చడంతో, ప్రదీప్ రంగనాథన్ తన రూట్ మార్చి ఒక సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఎలాగైనా సరే గట్టి హిట్ కొట్టాలనే కసితో ఆయన నటనకు కాస్త బ్రేక్ ఇచ్చి, నిర్మాతగా కొత్త ప్రయాణం షురూ చేసి ఓ వైవిధ్యమైన సినిమాను తెరకెక్కిస్తున్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కూడా మొదలైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో తాజాగా, ప్రదీప్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ సినిమా టైటిల్, ఒక క్రేజీ గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ప్రదీప్ రంగనాథన్ సొంతంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అనేవాలా... స్టార్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేయగా ఈ సినిమాకు కథను కూడా ప్రదీప్ స్వయంగా అందించడం విశేషం. ప్రముఖ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమా ద్వారా హీరోగా పరిచయం అవుతున్నారు. ప్రదీప్ రంగనాథన్ PRNEXTWAVE సంస్థను ప్రారంభించగా.. PRS1 పేరుతో తెరకెక్కనుంది.

అలాగే సీనియర్ నటి స్వాసిక, కొత్త నటి అనమికా మహి, శివాజీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ఒకరు కాదు, ఇద్దరు కాదు.. 'ఆల్ఫా యూనిట్' పేరుతో ఉన్న ఆరుగురు దర్శకులు కలిసి డైరెక్ట్ చేయబోతున్నారు. ఇది పూర్తిగా లేడీ ఓరియెంటెడ్ సినిమాగా రూపొందనుందని సమాచారం. అయితే ఇందులో 'ప్రేమలు' బ్యూటీ మమితా బైజు మెయిన్ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ప్రదీప్, మమిత కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈసారి వీరిద్దరూ తెరపై జంటగా కాకుండా.. నిర్మాతగా, నటిగా కలిసి వర్క్ చేస్తుండటం విశేషం. మూవీ టీమ్ రిలీజ్ చేసిన స్పెషల్ వీడియో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో మమితా బైజు చేతిలో కత్తి పట్టుకుని వైల్డ్ లుక్‌లో లేడీ డాన్ లా కనిపించి షాక్ ఇచ్చింది. ఆమె కత్తితో రక్తం చిందించి అశ్వత్ వైపు విసరడం, ఆయన దాన్ని అందుకుని మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్‌కు పాస్ చేయడం ఆసక్తిగా ఉంది. ఆ తర్వాత స్వాసిక, శివాజీ లుక్స్‌ను రివీల్ చేశారు. చివర్లో ప్రదీప్ రంగనాథన్ అదిరిపోయే రేంజ్‌లో ఎంట్రీ ఇచ్చారు. ఈ వీడియోకు సాయి అభ్యంకర్ ఇచ్చిన మాస్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.




## 'కింగ్-100'లో ఊహించని ట్విస్ట్




టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మైల్‌స్టోన్ మూవీ 'కింగ్ 100'. అయితే ఈ చిత్రంలో టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. రా. కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ మైల్‌స్టోన్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో టబు, సుస్మితా భట్, కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే గతంలో నాగార్జున, టబు కాంబినేషన్‌లో వచ్చిన 'నిన్నే పెళ్లాడుతా' లాంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఇండస్ట్రీ హిట్స్‌గా నిలిచాయి. వీరిద్దరూ చివరిసారిగా 'ఆవిడా మా ఆవిడే' అనే అవుట్ అండ్ అవుట్ కామెడీ సినిమాలో కలిసి నటించారు. ఆ సినిమా కూడా ప్రేక్షకులను బాగానే అలరించింది.

చాలా కాలం తర్వాత ఈ సూపర్ హిట్ జంట మళ్లీ కలిసి నటిస్తుండటంతో, వెండితెరపై పాత రోజుల్లాంటి లవ్ మ్యాజిక్ రిపీట్ అవుతుందని ఫ్యాన్స్ అందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన పలు వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో ఒక ఊహించని సర్‌ప్రైజ్ ఉండబోతోందని టాక్. ఇందులో ఒక పవర్‌ఫుల్ నెగటివ్ షేడ్స్ ఉన్న విలన్ పాత్రలో టబు కనిపించబోతున్నారట. ఈ క్రేజీ ట్విస్ట్ ఇప్పుడు అక్కినేని అభిమానులను తెగ ఆశ్చర్యపరుస్తోంది. నాగార్జునను ఢీకొట్టే లేడీ విలన్‌గా టబు పర్ఫార్మెన్స్ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుందని తెలుస్తోంది. పూర్తి ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో తండ్రి-కూతుళ్ల మధ్య వచ్చే సెంటిమెంట్ సీన్లు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయని సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన దాదాపు 80 శాతం షూటింగ్ విజయవంతంగా పూర్తయిందని తెలుస్తోంది. త్వరలో టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా చిత్రబృందం విడుదల చేయాలని భావిస్తున్నట్లు టాక్.